తరాల అంతరాలలో వచ్చిన మార్పులు చూసి ఆ తండ్రి తీసుకున్న నిర్ణయం ఏమిటి?

# మూడు ఉత్తరాలు

**తిరుమల పెద్దింటి గోపాల్ కథ**

తెరచి వున్న కిటికీలోంచి బలంగా వీచిన గాలికి హరికేన్ లాంతరు వత్తి మంట 'టపటపా' కొట్టుకుని ఆరిపోయింది.


రాత్రెప్పుడో పడిన వర్షానికి తడిసిన ఎర్రమందారాలు, గాలి వీచినప్పుడు నీటి బొట్లు రాలుస్తున్నాయి. కిటికీ రెక్కలు కొట్టుకోవడంతో మెలకువ వచ్చింది శాస్త్రికి.

సగం నలుపూ, సగం తెలుపూగల సంధ్య భావుకుడి మనసులో స్తబ్ధతలా వుంది.

తల విదిలించి, పక్కమీదనుంచి లేచి, తలకింద ముక్కాలిపీట మూలన పెట్టి, జంపఖానా మడత పెట్టి, తలుపు చప్పుడవకుండా బయటకొచ్చాడు. ఒక్కసారి చల్లని గాలి చుట్టుముట్టింది. మనసుని ఆవరించుకుని వున్న అసంతృప్తి అంతా పోయినట్లు అనిపించింది. పర్ణశాల లాంటి తాటాకు పాక వదిలి సంధ్యావందనానికి కాలువ గట్టుకు నడిచాడు [illegible] చలిలోనూ...

"ఓం సూర్యశ్చ మామన్యుశ్చ..." అన్న ప్రభాకరశాస్త్రి సంధ్యావందనానికి బద్ధకంగా మేల్కొన్నవాడిలా సూరీడు తూర్పుదిక్కునుంచి మెలమెల్లగా మీదకొస్తున్నాడు.

అతని కళ్లు కలువల్లా అందంగా వుంటాయని అందరికీ తెలియపర్చడం ఇష్టం లేనట్టు కళ్లు మూసుకుని గాయత్రిని జపిస్తున్నాడు. నిండా మునిగి మోకాళ్ల నీటిలో సంధ్యవారుస్తున్న, అతని గోష్పాదం మీదనుంచి నీటి బిందువులు వీపుమీద పడి బాలభానుడి కిరణాలతో మెరుస్తున్నాయి. విశాలమైన ఛాతితో, తెలుపు ఛాయతో ఐదున్నర అడుగుల ప్రభాకరశాస్త్రి చూడగా



వే ఎవరినైనా ఆకట్టుకుంటాడు. సంధ్యావార్చి కాలువ గట్టుపైకొచ్చిన ప్రభాకరశాస్త్రి, పైన ఇద్దరు నిలబడి వుండడం చూసి క్షణం గతుక్కుమన్నాడు. తమ కాలువలో గాయత్రిని జపిస్తుండగా వారు దిగి తనని అపవిత్రం చేయకూడదన్నట్టు, తన ధ్యానానికి అంతరాయం కలగకూడదన్నట్టు, తన సంధ్యావందనం అయ్యేవరకూ ఎవ్వరూ ఆ

కాలువలో దిగకుండా పైనుండడం అక్కడి ఆచారమన్నట్టు నిలబడి వున్నారు.

ఆపాటి గౌరవానికే తబ్బిబ్బయ్యాడు శాస్త్రి.

ఇంటికి వడివడిగా చేరుకున్న ప్రభాకర శాస్త్రికి వీధిలో — అప్పటికే సంధ్యావందనం ముగించుకుని, నుదుట తిలకం బొట్టుతో ఆ ఊరునంతటినీ శాసించే అధికారిలా వాలుకుర్చీలో కూర్చున్న తండ్రి 'పండిత విశ్వనాథ శాస్త్రి' కనిపించాడు.

ఆయన గొప్ప పండితుడు. కవిబ్రహ్మ. సంస్కృతాంధ్రాలలో ఆశువుగా అప్పటికప్పుడు అరవైకి తక్కువ కాకుండా పద్యాలు చెప్పగలడని ప్రతీతి. ఆయన వేదం చదివినా, పాఠం చెప్పినా సరస్వతీదేవి గుమ్మంలో విల్చుని వినేదని వినికిడి. అవును మరి వేటూరివారి సహచర్యం. లోపలికి నడిచి మడిగా తన తడిబట్టలు ఆరవేసుకుని, పొడిబట్టలు కట్టుకుని పైకొచ్చిన ప్రభాకరశాస్త్రిని పిలిచి "ఈ కవరు ప్రెసిడెంట్‌గారికిచ్చి ఆ పనయ్యేట్టు చూడు!" అన్నారు విశ్వనాథశాస్త్రి. అలాగేనన్నట్టు తలూపి కవరుని భద్రంగా పంచాంగంలో పెట్టి బయట కొచ్చాడు. బయటకు వస్తూండగా చూశాడు అప్పుడే ఆ ఇంటిలోకి ప్రవేశిస్తున్న నల్లరంగు మోటార్ సైకిల్‌ని.

○ ● ○

వ్యాఘ్రంలా ఉన్న ఆ శునకాన్ని చూసి అసహ్యించుకున్నాడేకాని భయపడలేదు.

ఆ కుక్క ప్రభాకరశాస్త్రిని చూసి తోక ఊపుకుని దగ్గరకు వచ్చింది. అది తనని తాకడానికి ప్రయత్నిస్తుంటే కొంచెం వెనక్కి జరిగి దాన్ని అదిలించాడు. 'ఛీ... ఛీ...' అంటూ.

అప్పుడు చూశాడతను, పేపరులోంచి తల పైకెత్తి!

"జానీ" అని ఆ కుక్కని పిలిచి పలకరించాడాయన "పంతులుగారూ... రండి ఏంటిలా వచ్చారు ఉదయాన్నే?"

శాస్త్రి వాకిట్లోకి నడిచి పంచాంగంలో దాచిన కవరుని తీసి ఆయనకిస్తూ అన్నాడు — "నాన్నగారు మిమ్మల్ని కలవమన్నారు"

ఆయన కవరు చింపి అందులోని కాగితాలు తీసి చదివాడు. ఆయన చదువుతున్నంతసేపు శాస్త్రేం మాట్లాడలేదు. ఆ కాగితాల్లో ఏం రాసుందో శాస్త్రికి తెలుసు. అయినా ఏం తెలియనట్లే మౌనం వహించాడు.

"నేను మాట్లాడి నాన్నగారికి కబురంపుతానని చెప్పండి" అన్నాడాయన కాగితాలు మడిచి.

ఆయన దగ్గర సెలవు తీసుకుని, వేదంలోని పనస వల్లె వేసుకుంటూ ఇంటివైపు వెళ్తున్న శాస్త్రిని ఓ వాహనం ఇంచుమించు రాసుకుంటూ వెళ్లిపోవడంతో ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. అది నల్లరంగు మోటరుసైకిల్.

○ ● ○

"మాతాపితృభ్యాం"

"మాతా పితృభ్యాం... మాతా పితృభ్యాం"

"జగతో"

"జగతో... జగతో"

విశ్వనాథశాస్త్రి ఉచ్చరిస్తున్న పదాన్ని వల్లెవేస్తున్నట్టు, ప్రభాకరశాస్త్రి ఒకో పదాన్ని రెండు పర్యాయాలు అంటున్నాడు.

"ఏమో"

"ఏమో ... ఏమో"

"... బాబుగారూ" అని పిలవడంతో విశ్వనాథశాస్త్రి కలిగిన అంతరాయానికి విసుగ్గా తలతిప్పాడు. కొద్ది దూరంలో వినయంగా ప్రెసిడెంట్‌గారి నమ్మిన బంటు సూరి నిలబడున్నాడు.

"ఏమిటన్నట్టు" చూశారాయన.

"ప్రెసిడెంట్‌గారు ఏదో మాట్లాడాలంట, చినబాబుని ఒకసారి పంపమన్నారు" చెప్పాడు సూరి.

ఆ మాట విన్న ఆయన ముఖంలో విసుగు స్థానంలో ప్రశాంతత కనిపించగా అన్నారు "తరువాత చెబుతాను... వెళ్లి ప్రెసిడెంట్‌గారిని కలువు" అని.

ప్రభాకరశాస్త్రి కుమారసంభవం పుస్తకం మూసి మిగిలిన పుస్తకాలు లోపల సర్ది, సూరి వెనుక ప్రెసిడెంట్‌గారి ఇంటివైపు నడిచాడు. దారిలో నడుస్తూ అడిగాడు సూరిని "మీ అబ్బాయి ఎలా వున్నాడూ?" అని.

సూరి ఏం మాట్లాడలేదు.

"ఈ మధ్య నీకు ఉత్తరాలేం రాయలేదా?"

లేదన్నట్టు తల అడ్డంగా ఊపాడు సూరి.

"డబ్బు ఏమైనా పంపుతున్నాడా?"

"లేదు బాబు!"


"బాధపడుతున్నావా?"

ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి చూశాడుసూరి ప్రభాకరశాస్త్రి ముఖంలోకి.

"సూరీ... మీ అబ్బాయి ఎందులో పనిచేస్తున్నాడు?"

"ఏదో బాబు... నాకు నోరు తిరగదు.. కానీ గవర్నమెంటుదే!"

"నీ పొట్టకు సరిపడ తిండి ప్రెసిడెంటుగారింట్లో దొరక్కపోదు. అలాంటప్పుడు నువ్వు నీ కొడుకుపంపే డబ్బుకోసం ఆశించడం అనవసరం. అంటే తండ్రీకొడుకుల మధ్య వుండే సంబంధ తీగలని నీ చేతులతో నువ్వు తెంపెయ్యమనడంలేదు. వాడంతట



వాడే నిన్ను మరచిపోయినప్పుడు నువ్వుమాత్రం వాడిగురించి ఎందుకు పట్టించుకోవాలి' అంటున్నాను. నేనిదంతా ఎందుకు చెప్తున్నానంటే — మొన్న ఈ మధ్య ఏదో మాటల సందర్భంలో నీ గురించి ప్రెసిడెంట్‌గారు చెప్పారు.

... పక్షి, పిల్లని రెక్కలొచ్చేవరకే పెంచుతుంది. రెక్కలొచ్చిన తర్వాత అది ఆహారం ఎలా సంపాదించుకుంటోందీ అన్నది పట్టించుకోదు! ఆ ఆహారంలో తనకి భాగం ఇస్తుందనికూడా ఆ తల్లి పక్షికాని తండ్రిపక్షికాని ఆశించదు!"

వేదం చదివిన నోటితో ఏది మాట్లాడినా వేదంలాగే వుంటుందేమో? మంత్రముగ్ధుడిలా శాస్త్రిమాటలు వింటూండిపోయాడు సూరి.

ప్రెసిడెంట్‌గారి ఇల్లు దగ్గర పడడంతో సూరి మాట్లాడలేదు. శాస్త్రికూడా మరేం మాట్లాడలేదు. ప్రెసిడెంట్‌గారితో మాట్లాడి ఇంటికి బయల్దేరుతూ సూరికోసం చూశాడు శాస్త్రి. సూరి కనిపించలేదు.

○ ● ○

"ఆ పని విషయమై నిన్న పట్నం వెళ్లి మాట్లాడారుట. పదివేల రూపాయలు ఖర్చు అవుతుందట. సాయంత్రానికి సమకూర్చితే రేపు వెళ్లి ఆ పని చేయించుకుని వస్తారట' చెప్పాడు శాస్త్రి — తండ్రికి ప్రెసిడెంట్‌గారు కబురు పంపడానికి కారణం!

ఆ మాట విన్న విశ్వనాథశాస్త్రి సమాధిలోకి వెళ్లినవాడిలా పది నిమిషాలు ఏం మాట్లాడకుండా ఆలోచిస్తుండిపోయారు. కొద్ది క్షణాలు తర్వాత ఆలోచనలోంచి తేరుకుని అన్నారు — "ఆ కర్రపెట్టెలో... ఉన్న డబ్బులెక్కపెట్టి సాయంత్రానికి ఆయనకి అందజెయ్యి!"

ఆ మాటలంటున్నప్పుడు ఆయన కంఠం కొద్దిగా వణికింది. అది గమనించిన ప్రభాకరశాస్త్రి ఏదో అనబోయి మళ్లీ ఏం అనలేక ఎవరో గొంతునొక్కిపెట్టినట్టు 'సరే'నని తలాడించాడు. వార్ధక్యంలో ఉపయోగపడుతుందని పౌరోహిత్యం చేస్తున్నప్పుడు విశ్వనాథశాస్త్రి కూడబెట్టి కర్రపెట్టెలో దాచిన పైసాపైసా డబ్బుని వేరే పనికోసం తీస్తున్నప్పుడు ప్రభాకరశాస్త్రి చేతులు కొద్దిగా వణికాయి.

తండ్రికి ఎదురుచెప్పలేని ప్రభాకరశాస్త్రి మనసులో ఇష్టంలేకపోయినా మౌనంగా ఆయన చెప్పినట్టు చేశాడు.

○ ● ○

అప్పటికి రెండు రోజులైంది ప్రెసిడెంట్‌గారికి డబ్బు అందజేసి. ఆ రోజు మళ్లీ సూరొచ్చి పిలిచాడు —

"చినబాబుగారు! మిమ్మల్ని ప్రెసిడెంట్‌గారు రమ్మంటున్నారు"

లోపల పూజచేసుకుంటున్న తండ్రికి చెప్పి ప్రభాకరశాస్త్రి బయటకు వచ్చాడు. అప్పుడు చూశాడు మందారచెట్టుకి, కొబ్బరిచెట్టుకు మధ్యనున్న నల్లరంగు మోటార్‌సైకిల్‌ని. సూరికూడా ఆ మోటార్‌సైకిల్‌వైపు చూసి ప్రభాకరశాస్త్రి ముఖంలోకి చూశాడు.

శాస్త్రి ముఖకవళికలు ఏం భావాన్నీ వ్యక్తపరచలేదు. మౌనంగా ప్రెసిడెంట్‌గారి ఇంటివైపు నడిచాడు. వెనకే సూరి. కొంతసేపటివరకూ మౌనం ఇద్దరిమధ్యా రాజ్యమేలింది. ఆ మౌనాన్ని భంగపరుస్తూ అడిగాడు

సూరి — "బాబూ... మీకు పట్నం చదువులు చదువుకోవాలని వుండేదికాదా?"

ఆ ప్రశ్నకి ప్రభాకరశాస్త్రి వెనక్కి తిరిగి సూరి ముఖంలోకి తీక్షణంగా చూశాడు.

సూరి క్షణం భయపడ్డాడు. అలాంటి ప్రశ్నవేసినందుకు. అయినా శాస్త్రి జవాబుగా చిన్న నవ్వు నవ్వి అన్నాడు — "మొదట్లో వుండేది, కానీ ఆ పట్టణాల్లో — ఆ నాగరికతలో వుండే కుళ్ళు, కల్మషాలు, చూసిన తర్వాత అనిపించింది, వాటి జోలికెళ్ల కూడదని! అందుకే ఎంతో ప్రశాంతంగా, పవిత్రంగా అందరూ గౌరవించే నా వృత్తి పౌరహిత్యాన్నే మా నాన్నగారి దగ్గర నేర్చుకుని నా ధర్మాన్ని నేను నిర్వర్తిస్తున్నాను."

సూరికి సగం అర్థమయింది. ఆ అర్థమైన సగం మాటల్లోనే తన ప్రశ్నకి సమాధానం దొరకడంతో సంతోషంగా శాస్త్రివైపు చూశాడు. అలా కొద్ది క్షణాలవరకూ ప్రభాకరశాస్త్రిని చూస్తూండిపోయాడు. ఆ చూపులో చిన్న ఈర్ష్య వుంది. అది ప్రభాకరశాస్త్రి మీదకాదు విశ్వనాథశాస్త్రిమీద.

పట్నంలో ఉద్యోగం నెపంమీద అవసాన దశలో తనకి దూరమైన కొడుకు. వార్ధక్యంలోకూడా తనని అంటిపెట్టుకుని వుండే ప్రభాకరశాస్త్రిలాంటి పుత్రరత్నాన్ని కన్న మరో తండ్రి విశ్వనాథశాస్త్రిమీద అసూయ అది.

... ... ...

కొంతసేపటికి ప్రెసిడెంట్‌గారితో మాట్లాడి ఇల్లు చేరుకున్న ప్రభాకరశాస్త్రి ఇంట్లోకి ప్రవేశిస్తూ కొబ్బరిచెట్టు ప్రక్క చూశాడు. ఆ ప్రక్కనే మందారచెట్టుకింద అతనూహించినట్టే అక్కడ నల్లరంగు మోటారు సైకిలుంది.

ప్రెసిడెంట్‌గారిచ్చిన చేతిలోని కాగితాలను విశ్వనాథశాస్త్రికి అందిస్తూ అన్నాడు — "ఈ పనిచెయ్యడానికి చాలా కష్టపడవలసి వచ్చిందట, అయినప్పటికీ ప్రెసిడెంట్‌గారే స్వయంగా వెళ్లడంచేత పని చేయించుకుని

## కొవ్వొత్తి

గిరి చెప్పాడు హరికి.

"హీరో గాలికుమార్ హీరోయిన్ గాలిశ్రీ పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. ముహూర్తం టైంకు కరెంటు లేక కొవ్వొత్తుల వెలుగులో పెళ్ళి అయిందనిపించారు"

"తర్వాత" అడిగాడు హరి.

"ఏముందీ.. వాళ్ల పెళ్లికూడా కొవ్వొత్తిలాగే వారం రోజులలో కరిగిపోయింది"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



వచ్చారు''

విశ్వనాథశాస్త్రి కళ్లలో ఆనందం ఎంత దాచుకుందామన్నా దాగలేదు. అది ప్రభాకర శాస్త్రి చూపునుంచి తప్పించుకోలేదు.

''మనం ఎంతైనా ఆయనకి ఋణపడి వున్నాం'' అన్న తండ్రి మాటకి ప్రభాకరశాస్త్రి ఏం మాట్లాడలేదు.

''అన్నట్టు చెప్పడం మరిచాను... నిన్ను నాయుడుగారు ఓసారి రమ్మనమని కబురు పంపారు. వాళ్లబ్బాయికి వివాహం నిశ్చయం అయిందట... ముహూర్తం నిర్ణయించాలిట! ''

... ... ...

''సరే... నేనలా నాయుడుగారింటివైపు వెళ్లొస్తాను'' అనిచెప్పి బయటకు వచ్చాడు. బయటకొస్తున్నప్పుడు అతను పంచాంగం పుస్తకం పట్టుకోవడం మరచిపోలేదు.

○ ● ○

నెమ్మదిగా ఓ వారం గడిచింది.

పెరట్లో తడిబట్టల్ని ఆరవేస్తుండగా విశ్వనాథశాస్త్రి అన్నారు — ''తిలకం దిద్దుకుని రా... నీతో కొంచెం మాట్లాడాలి'' అని.

మల్లెపందిరికింద వాలుకుర్చీలో కూర్చున్న విశ్వనాథశాస్త్రికి దగ్గరలో అరుగుమీద కూర్చుంటూ అడిగాడు ప్రభాకరశాస్త్రి. నుదుటిమీద విభూది, తిలకం దిద్దుకుని ''ఏమిటి నాన్నగారూ... మాట్లాడాలన్నారు?'' ఆయన ఒకసారి ప్రభాకరశాస్త్రివైపు చూసి తన ప్రక్కనున్న చేతి పంచిలోంచి మూడుత్తరాలు తీసిచ్చారు, చదవమన్నట్టు.

ప్రభాకరశాస్త్రి ఒక ఉత్తరాన్ని విప్పి చదవసాగాడు, పైకి వినిపించకుండా.

''ప్రియమైన నాన్నగారికి'' మొదటివాక్యం చదివి ఆయనవైపు చూశాడు.

''ఫర్వాలేదు చదువు'' అన్నారాన.

నేను క్షేమం. మీరూ చిన్నతమ్ముడూ క్షేమమని తలుస్తాను. మీకోడలు, మనవలూ క్షేమమే! ఎప్పటినుంచో నేనే ఉత్తరం రాద్దామనుకుంటూ ఏవో అవాంతరాలవల్ల రాయలేకపోయాను.

ఇకపోతే — ఇక్కడ నా ప్రాక్టీసు అంతంతమాత్రంగా వుంది. పట్టణాల్లో కాపురమంటే మీకు తెలియనిదికాదు. ఎంత ఖర్చవుతుందో? అయినా ఈ మధ్య అడుగడుగునా ఓ డాక్టరు అవతరించాడు. అందుకే పరిమిత ఆదాయంతో ఆర్థికంగా ముందంజ వేయలేకపోతున్నాను. ఇద్దరు పిల్లలకీ కాన్వెంట్లు ఫీజులు కట్టడానికే భారంగా వుంది. అంతేకాక మీ కోడలి స్వభావం మీకు తెలియదు. వాళ్ల స్వంత తమ్ముడొస్తే భరించలేని మనస్తత్వం. అందుచేత మీ సున్నిత హృదయం తన ప్రవర్తనవల్ల గాయం కావచ్చు. మీరు సహృదయతతో అర్థం చేసుకుని తమ్ముడితో శేషజీవితాన్ని అక్కడే గడిపేస్తే మంచిదని నా అభిప్రాయం. లేదూ మీర్రేదైనా చెపితే పెద్దకొడుకుగా నా బాధ్యత నిర్వర్తిస్తాను.

ఇలా వ్రాసినందుకు అన్యథా భావించరని అనుకుంటూ —

మీ పెద్దవాడు
శివకుమార్

ప్రభాకరశాస్త్రికి తరాల అంతరాల్లో వస్తున్న తత్వపరిణామం క్రమక్రమంగా అర్థమవుతుండగా తండ్రివైపు చూశాడు. రెండోఉత్తరం చదవమన్నట్లు చూశారు

విశ్వనాథశాస్త్రి.

"నాన్నగారికి!

సుహాసిని వ్రాయునది. మీ ఉత్తరం అందింది. తమ్ముడు క్షేమమని తలుస్తాను. మీరింకోవిధంగా భావించరనే ఉద్దేశ్యంతో ఈ జవాబు వ్రాస్తున్నాను. అత్తవారింట్లో ఓ వారం పదిరోజులైతే ఫర్వాలేదుకానీ జీవితాంతం అంటే బాగుండదు. అయినా మీ అల్లుడిగారికి ప్రశాంతత కావాలి. ఇంట్లో ఎంత విశ్వబ్దం పాటిస్తే అంత ఇష్టం. అంతేకాక ఆయనకి సనాతన ధర్మాలమీద అంత నమ్మకంలేదు. అయినా కన్నవాళ్ల పోషణ బాధ్యతల్ని కొడుకులు స్వీకరించడం ధర్మం. అన్నీ తెలిసి మీరు నాకు ఉత్తరం వ్రాయడం ఏమిటోలావుంది. నేను అన్నయ్యకి వుత్తరంరాసి నెలకి ఎంతోకొంత కావాలంటే పంపగలను. మరేమీ అనుకోకండి!


ఇట్లు
మీ సుహాసిని

"మూడో ఉత్తరంకూడా చదువు!" అన్నారు విశ్వనాథశాస్త్రి కొడుకుతో.

"నేను క్షేమం. మీరు క్షేమమని తలుస్తాను. నా విషయంలో ప్రెసిడెంట్‌గారు చాలా శ్రమపడ్డట్టు తెలుస్తోంది. నా తరఫునకూడా మీరు కృతజ్ఞతలు తెలియజేయండి. నేను పట్నంనుంచి డబ్బు పంపమని వేధిస్తున్నానని, నా మీద ఇంకా తమ్ముడికి కోపం తగ్గలేదనుకుంటా! ఇక ఆ అవసరం వుండదులెండి!

మన ఇంటిముందు ఆగివున్న నా వల్లరంగు మోటారు సైకిలు చూసికూడా వాడు ఇంట్లో మూడో మనిషి ఉన్నట్టు ప్రవర్తించలేదు. నన్ను పలకరించలేదు. నేనుకూడా అందుకే వాడితో మాట్లాడలేదు. మీరూ, వాడే ఆ ఇంట్లో వుంటున్నట్టు వాడు ప్రవర్తించిన తీరు నాకు కోపం తెప్పించింది. ప్రెసిడెంటుగారిప్పించిన ఈ ఉద్యోగంలో నాకు నెలకి పదిహేను వందలదాకా వస్తాయి. అయితే చదువుతున్నప్పుడు కొన్ని అప్పులు

## బంగారుదేశం?



బంగారు ఆభరణాలకు మన దేశంలో ఉన్నంత మోజు మరేదేశంలోనూ వుండదు! ప్రస్తుతం మన దేశంలో ఏడువేల టన్నుల బంగారం స్టాక్ వుంది! ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే బంగారంలో 17 శాతం మన దేశంలో నగల రూపంలోకి మారుతోంది! గత సంవత్సరం 56 మిలియన్ బంగారు ఆభరణాల్ని 26 మిలియన్‌ల మందికి అమ్మారట! ఒకవేళ మనదేశం అప్పులు తీర్చివేయాలనుకుంటే... ప్రైవేట్ వ్యక్తులదగ్గర ఉన్న బంగారంలో 40 శాతం అమ్మేస్తే చాలుట! ఇది నిజంగా నిజం!!

— జూపిటర్

చేయాల్సి వచ్చింది. అదీగాక నేను నా భవిష్యత్‌కోసం కొంచెం వెనకేసుకోవడం స్వార్థమైనా తప్పనిసరి. అందుచేత మీకు నెలనెలా డబ్బు పంపలేను. కానీ ఏదైనా అవసరం వుంటే ఉత్తరం రాయండి. మళ్లీ నేను కాస్త వెలదొక్కుకున్నాక ఉత్తరం రాస్తాను.

మీ కేశవుడు (కేశవశాస్త్రి)

ఉత్తరాలు పూర్తిచేసి తండ్రివైపు చూడకుండా తలదించుకుని నేలచూపులు చూస్తున్నాడు ప్రభాకరశాస్త్రి.

"ప్రభాకరం! నీ అభిప్రాయమేంటి చెప్పు! నే బాధపడను. ఇవన్నీ ఆధునిక జీవన సంస్కృతిలో అత్యంత కీలకమైన సూత్రాలు. కర్మభూమిలో పుట్టి, ఉమ్మడి కుటుంబంలో అనుబంధాల సూత్రాల మధ్య పెరిగినవాడిని. వేదవేదాంగాలూ, ధర్మసూత్రాలు ఔపోశన పట్టినవాడ్ని ఆ మాత్రం జీర్ణం చేసుకోలేనా? ఆ కొబ్బరిచెట్టును చూడు మట్టలు తనని వదిలివెళ్లిపోతూ 'మచ్చలు' మిగిల్చినా ఇంకా తన ధర్మాన్ని నిర్వర్తిస్తోంది. అలాగే నేనూ. పెద్దవాడ్ని డాక్టరు చదివించడానికి, అమ్మ మద్రాసు హాస్పిటల్లో వున్నా లెక్కచేయక ఎంత అప్పుచేశాం? హాసిని పెళ్లికోసం ఉన్న భూమి కాస్త అమ్మి... ఇక కేశవుడి సంగతి నీకు పూర్తిగా తెలుసు... ఇక నీ నిర్ణయంకూడా చెబితే, నా శేషజీవితాన్ని ఎలా గడపాలో నిర్ణయించుకుంటాను..." అని వాలుకుర్చీలోంచి లేవబోయి తూలిపోయారు వార్ధక్యంవల్ల.

అంతే —

క్షణంలో చెంగున గెంతి ఒడుపుగా పట్టుకుని ఆయన కళ్లలోకి చూశాడు ప్రభాకరశాస్త్రి.

ఆ చూపులో "తనదు రూపుదిద్ద తానెదిగెనో — నీవు చూపినదొక్కటే నిజము దారి — దారితప్పక నడిచెదు ధైర్యమిమ్ము — నీకు మ్రొక్కెంగ యోగ్యత మాకు మిగుల పరమ పురుష" అన్న భావం గోచరమవుతోంది.

